www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 జనవరి 2026

5

ఏలూరు

పూలే జీవితం నేటి తరాలకు మార్గదర్శకం

ఏలూరులోని హోప్ స్కూల్లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు

వార్త ఆరో పేజీలో..

కన్ను తెరవని.. పసి ప్రాణాలు..!

- 3 నెలల్లో 47 శిశు మరణాలు, ఒక మాతృ మరణం
- ప్రతి వెయ్యి ప్రసవాల్లో 9 పసి ప్రాణాలు మృత్యుఒడిలోకి
- జీరో స్థాయికి తీసుకురావడలో ప్రభుత్వం విఫలం
- పౌష్టికాహార లోపంతోపాటు కారణాలెన్నో
- పేద కుటుంబాల్లోనే శిశుమరణాలు అత్యధికం
- మాతా, శిశు మరణాలపై అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైద్య రంగంలో టెక్నాలజీ పెరిగినా మాతా, శిశుమరణాలను జీరో స్థాయికి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైన పరిస్థితి నెలకొంది. జిల్లాలో మాతా, శిశు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. జులై నుంచి సెప్టెంబర్ వరకూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా 47 శిశు ప్రాణాలు కన్ను తెరవకుండానే గాలిలో కలిసిపోయిన పరిస్థితి నెలకొనగా ఒక మాతృ మరణం సైతం సంభవించిన పరిస్థితి నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాతా, శిశుమరణాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన పరిస్థితి. మాతా, శిశు మరణాల అడ్డుకట్టకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించిన పరిస్థితి నెలకొంది. శిశు మరణాలు రాష్ట్ర సగటు కంటే జిల్లాలో తక్కువగా ఉన్నప్పటికీ టెక్నాలజీ ఇంత అభివృద్ధి చెందిన తర్వాత సైతం ఇంకా శిశుమరణాలు పెద్ద ఎత్తున జరుగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. జిల్లాలో ప్రతినెలా 1500 నుంచి రెండు వేల ప్రసవాల వరకూ జరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 40 శాతం ప్రసవాలు జరుగుతుండగా, ప్రయివేటులో 60 శాతం వరకూ జరుగుతున్నాయి. సాధారణ ప్రసవాలకంటే అత్యధికంగా ఆపరేషన్ ద్వారానే ఎక్కువగా సాగుతున్న పరిస్థితి. అత్యవసర సమయంలో మాత్రమే ఆపరేషన్లు చేయాల్సి ఉన్నప్పటికీ సొమ్ముల కోసం ప్రయివేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు విచ్చలవిడిగా ఆపరేషన్లు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో జరిగే ప్రసవాల్లో ఆపరేషన్ల సంఖ్య 55 శాతం ఉండగా, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆ సంఖ్య 65 శాతం వరకూ ఉన్నాయి. అయినప్పటికీ మాతా, శిశుమరణాల నమోదు ఎక్కువగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వైద్యశాఖ అధికారులు మాత్రం మాతా, శిశుమరణాలకు అనేక కారాణాలు ఉన్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో సగటున ప్రతి వెయ్యి ప్రసవాల్లో 25 వరకూ శిశుమరణాలు జరుగుతుండగా జిల్లాలో ఆ సంఖ్య తొమ్మిది వరకూ ఉందని వైద్య శాఖ చెబుతోంది. వైద్య రంగం పెద్ద ఎత్తున అభివృద్ధి చెందిన తర్వాత సైతం ఇంకా మాతా, శిశుమరణాలు కొనసాగడం ఏంటన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

పౌష్టికాహారంతో పాటు, అనేక కారణాలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెబుతున్నా ఇంకా అనేక పేద కుటుంబాలకు చెందిన గర్భిణుల్లో పౌష్టికాహార లోపం వేధిస్తోంది. దీంతో బిడ్డ పెరుగుదల లేకపోవడం శిశు మరణాలకు కారణంగా తెలుస్తోంది. కొన్ని వంశపారం పర్యంగా వచ్చే వ్యాధులను గుర్తించడంలోనూ విఫలమవుతున్న పరిస్థితి నెలకొంది. గర్భిణీ సమయంలో పేద కుటుంబాలకు చెందిన మహిళలకు సరైన వసతులు లేకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. గిరిజన, దళిత కుటుంబాల్లో ఇల్లు గడవడం కష్టంగా మారడంతో నెలలు నిండే వరకూ పనులకు వెళ్లడం, ఆ సందర్భంలో ఎక్కువ దూరం ప్రయాణాలు చేయడం వంటి కారణాలు సైతం మాతా, శిశు మరణాలకు కారణంగా కనిపిస్తోంది. పేద కుటుంబాలకు చెందిన గర్భిణులను ఆర్థికంగా ఆదుకునే విధంగా సరైన చర్యలు లేకుండా పోయాయి. గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గర్భిణులను గుర్తిస్తున్నా నిరంతర పర్యవేక్షణ, శ్రద్ధ తీసుకోవడంలో ఆరోగ్య శాఖ విఫలమవుతోందన్న విమర్శలు ఉన్నాయి. గర్భిణులను గుర్తించిన తర్వాత ప్రతి రోజూ ఎటువంటి ఆహారం తీసుకుంటున్నారు. బరువు ఎంత ఉన్నారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలో గర్భిణులకు అవగాహన కల్పించకపోవడం, ప్రసవ సమయంలో ముందుగానే సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో వైద్యశాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రతినెలా చెకప్‌లో సమస్యలు గుర్తించడంలో ఆరోగ్యశాఖ విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. కేరళ వంటి రాష్ట్రంలో మాతా, శిశుమరణాలు జీరో స్థాయిలో ఉన్నాయి. అటువంటి పరిస్థితి రాష్ట్రంలో రావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా దళిత, గిరిజన వెనుకబడిన సామాజిక తరగతి ప్రజానీకంపై ఎక్కువగా దృష్టి సారించాల్సి ఉంది. అప్పుడే జీరో స్థాయిలో మాతా, శిశుమరణాలు సాధ్యం అవుతాయి. దీనికి జిల్లా వైద్యశాఖ మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఫిబ్రవరి 2వ వారంలో కొల్లేరు ఉత్సవం

ముగ్గురు అధికారులతో కమిటీ, నోడల్ అధికారిగా జెసి

కొల్లేరు ఉత్సవం నిర్వహణపై అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఫిబ్రవరి 2వ వారంలో కొల్లేరు ఉత్సవాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శనివారం 'కొల్లేరు ఉత్సవం' ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో విదేశీ వలస పక్షులు వచ్చే ప్రాంతంలో 'కొల్లేరు ఉత్సవాన్ని' ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కొల్లేరు ప్రాంతానికి ప్రస్తుతం విదేశాల నుండి వివిధ రకాల వలస పక్షులు వచ్చే సమయమని, వాటిని ఆసక్తి గల వారందరూ తిలకించేలా ఫిబ్రవరి 2వ వారంలో రెండు రోజుల పాటు 'కొల్లేరు ఉత్సవాన్ని' నిర్వహించాలని, ఉత్సవ నిర్వహణపై సెట్‌వెల్ సిఇఒ, స్కిల్ డెవలప్మెంట్ అధికారి, పర్యాటకాభివృద్ధి అధికారులతో కమిటీని ఏర్పాటుచేసి, నోడల్ అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ వ్యవహరించాలన్నారు. కొల్లేరు ఉత్సవ నిర్వహణ ప్రదేశం, ఈవెంట్ నిర్వహణ సంస్థ తదితర అంశాలపై వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కొల్లేరు ఉత్సవంలో పాల్గొనే ప్రజల సంఖ్యను అంచనావేసి, అందుకు అనుగుణంగా పక్షులు చూసేందుకు అనువైన ప్రదేశాలు, అందుకు అవసరమైన బైనాక్యులర్లు, బోటింగ్ నిమిత్తం బోట్లు ఏర్పాటు చేయాలన్నారు. విదేశీ వలస పక్షులు గురించి వచ్చే సమయంలో వాటిని అందరూ తిలకించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. పర్యాటకుల్లో జోష్ నింపేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, తదితర అంశాల్లో పోటీలు నిర్వహించాలన్నారు. పర్యాటకులను ఆహ్లాదపరిచే విధంగా సాంస్కృతిక సంఖ్యకు తగిన విధంగా ఫుడ్ కోర్టులు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని అదే విధంగా తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ సిహెచ్.పవన్ కుమార్, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకర్, జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి పట్టాభిరామయ్య, స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎన్.జితేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలకు కట్టుకుని నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కళ్లకు గంతలు కట్టుకుని.. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వేతన పెంపు కోరుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన ధర్మ పోరాట దీక్ష శనివారానికి 11వ రోజుకు చేరింది. ఈ మేరకు వారు కళ్లకు గంతలు కట్టుకుని 'అధికారులారా.. కళ్లు తెరవండి' అంటూ నినాదాలు చేస్తూ క్యాంపస్ అంతా తిరిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో బూటకపు వాగ్దానాలు ఇచ్చి ఐఐటి, ఎన్ఐటి, సెంట్రల్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదివిన తమను ఆర్‌జియుకెటికి ఆహ్వానించారని, ఉద్యోగ భద్రత, వేతన పెంపు వంటి అనేక హామీలు కల్పించారని, చివరకు తమకు న్యాయంగా రావాల్సిన వేతన పెంపు గురించి అడిగితే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. శాశ్వత అధ్యాపకులు, మెంటర్లు వీరి దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపారు. రిలే నిరాహార దీక్షలో మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు అహ్మద్ బాషా, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ అధ్యాపకులు సామినేని భవాని, కెమిస్ట్రీ అధ్యాపకురాలు విజయశ్రీ పాల్గొన్నారు.

చేపల చెరువు సమస్య పరిష్కారం

ఎంఎల్ఎ, ఆర్‌డిఒ, ఆప్కాబ్ ఛైర్మన్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం

పరిష్కారానికి ఇరు వర్గాలు సమ్మతి

నిడమర్రు తహశీల్దార్ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, నిడమర్రు

రైతులతో చర్చిస్తున్న ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆర్‌డిఒ అంబరీష్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

నిడమర్రు మండలం అడవికొలను రెవెన్యూ పరిధిలోని తిమ్మారావుగూడెంలో ఏడాదిన్నరగా కొనసాగుతున్న వివాదాస్పద చేపల చెరువు సమస్య పరిష్కారమైనట్లు తహశీల్దార్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. చేపల చెరువుకు సంబంధించిన సమస్యపై శనివారం ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఇరుపక్షాల రైతుల సమావేశం నిర్వహించినట్లు తహశీల్దార్ తెలిపారు. వివాదంలో ఉన్న చేపల చెరువు వద్దకు వెళ్లి వీరంతా పరిశీలించారు. ఏడాదిన్నరగా నిలిచిపోయిన ఆరెకరాల బాధిత రైతుల చెరువును, ఐదు నెలలుగా నిలిచిపోయిన పక్కనే ఉన్న 70 ఎకరాల చెరువుకు సంబంధించిన సమస్యలను రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఇరుపక్షాల ఎటువంటి సమస్యలేకుండా పరిష్కరించుకోవాలని సూచించారు. ఇరుపక్షాల రైతులు తమ వాదనలను ఆర్‌డిఒ, ఎంఎల్ఎ, ఆప్కాబ్ ఛైర్మన్ ముందు వినిపించారు. తమ చెరువును ఉద్దేశ పూర్వకంగానే తప్పుడు ఫిర్యాదులు చేసి నిలిపివేసినట్లు ఆరెకరాల చిన్నచేపల చెరువుకు సంబంధించిన బాధిత రైతు సత్యనారాయణ అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపారు. దీనికి సంబంధించి సాక్ష్యాలను వివరించారు. అనంతరం ఇరుపక్షాలను నిడమర్రు తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. ఆరెకరాల చేపల చెరువు సాగుకు సంబంధించి పెద్ద చెరువు సాగుదారులు ఎటువంటి ఇబ్బంది పెట్టకూడదని, 70 ఎకరాల చేపల చెరువు కూడా సాగులోకి వచ్చేలా ఇరుపక్షాలకు నచ్చజెప్పారు. అందుకు ఇరుపక్షాలు అంగీకరించినట్లు తహశీల్దార్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఎంఎల్ఎ, ఆర్‌డిఒ, ఆప్కాబ్ ఛైర్మన్ సమక్షంలో అంగీకరించిన మాటలకు 70 ఎకరాల చేపల చెరువుకు సంబంధించిన వక్తులు పాటిస్తారా అన్న చర్చ కొనసాగుతోంది. ఎంఎల్ఎ, ఆర్‌డిఒ, ఆప్కాబ్ ఛైర్మన్ సమక్షంలో చేసిన ఒప్పందాన్ని పెద్ద చెరువులోని వ్యక్తులు పాటించకపోతే అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్న చర్చ అందరిలోనూ నెలకొంది. చిన్న చేపల చెరువు సాగులోకి వచ్చిన తర్వాతే పెద్ద చెరువుకు సంబంధించి అనుమతులు మంజూరు చేయాలని, లేకపోతే అవతలివైపు రైతులు అధికారుల వద్ద చేసుకున్న ఒప్పందాన్ని పాటించకపోతే సమస్య మళ్లీ పునరావృతం కావడంతోపాటు, తీవ్ర రూపం దాలుస్తుందన్న చర్చ గ్రామంలోని రైతుల్లో నెలకొంది. ఆరెకరాల చిన్న చేపల చెరువును సాగులోకి తెచ్చే బాధ్యత తమదంటూ ఆర్‌డిఒ, ఎంఎల్ఎ, ఆప్కాబ్ ఛైర్మన్ హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారం అవుతుందని బాధిత రైతులు ఆశిస్తున్నారు. ఈ సమావేశంలో నిడమర్రు మండల సబ్ ఇన్‌స్పెక్టర్, ఆర్ఐ, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిన కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభ ముగింపు సందర్భంగా జరిగే బహిరంగ సభకు ఏలూరు నగరం నుంచి వందలాది మంది కార్మికులు బయలుదేరి వెళ్లారు. శనివారం ఏలూరు నుంచి వ్యక్తిగత వాహనాలు, బస్సులు, రైళ్ల ద్వారా విశాఖ నగరానికి పెద్ద ఎత్తున కార్మిక ఉద్యోగులు సిఐటియు మహాసభకు వెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైఎస్.కనకారావు, ఎం.ఇసాక్ మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన తర్వాత మొదటిసారి ఆంధ్ర రాష్ట్రంలో వైభవోపేతంగా అఖిలభారత మహాసభ విశాఖలో జరుగుతుందని చెప్పారు.

ఈ సందర్భంగా గత నెల 27వ తేదీ నుంచి శ్రామిక ఉత్సవ్ ఘనంగా కొనసాగుతుందని, దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి కార్మిక నాయకులు మహాసభకు హాజరయ్యారని చెప్పారు. నాలుగో తేదీన విశాఖపట్నం మున్సిపల్ స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభకు, కార్మిక ప్రదర్శనకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది కార్మికులు తరలి వెళ్లనున్నారని వివరించారు. మహాసభ కార్మిక వర్గ ఐక్యత కోసం, హక్కుల కోసం రాజీలేని పోరాటం రూపకల్పన చేసిందని, ఆదివారం జరిగే బహిరంగ సభ అందుకు వేదిక కానుందని తెలిపారు.

కమ్ముకున్న మంచు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

దట్టంగా కమ్ముకున్న మంచు

మండలంలో గత వారం నుంచి ఉదయం సమయాల్లో అరుదైన వాతావరణ పరిస్థితి నెలకొంటుంది. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి విపరీతమైన మంచు అలుముకుని ఉదయం తొమ్మిది గంటల వరకు కొనసాగుతుంది. ఉష్ణోగ్రతలు సుమారు 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో, మంచు వర్షంలా కురుస్తున్నట్లు దృశ్యాలు కనిపించాయి. ఈ చలి ప్రభావంతో ప్రజలు ఉదయపు పనులు కొంత ఆలస్యంగా ప్రారంభించినప్పటికీ, రైతులకు ఇది శుభవార్తగా మారింది. రాత్రివేళ ఏర్పడిన మంచు కారణంగా నేలలో తేమ నిల్వ ఉండటంతో కూరగాయలు, పప్పుధాన్య పంటలకు సహజమైన తేమ అందుతోంది. దీని వల్ల సాగునీటి అవసరం కొంత మేర తగ్గి, పంటల పెరుగుదల మెరుగుపడే అవకాశముందని రైతులు చెబుతున్నారు. అయితే, చలి తీవ్రత పెరగడంతో చలి జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సమస్యలు కొంతమందిలో కనిపిస్తున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయపు వేళల్లో వేడి దుస్తులు ధరించడం, గోరువెచ్చని నీరు తాగడం వంటి సాధారణ జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని సూచిస్తున్నారు.

జాతీయ స్థాయిలో లింగపాలెం విద్యార్థుల ప్రతిభ

అభినందించిన చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం ధర్మాజీగూడెం నుంచి క్రిశాలిస్ ఇంటర్నేషనల్ స్కూల్లో కృత్రిమ మేధస్సును ఉపయోగించి రోడ్డు ప్రమాదాలను ఎలా నివారించవచ్చనే (రెడ్ జోన్ వాచ్) ప్రాజెక్టును వివరించారు. దానికి ఫ్యూచర్ రెడీ స్కూల్ అవార్డు రావటం అభినందనీయమని చింతలపూడి ఎంఎల్ఏ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. గతేడాది డిసెంబర్ 27వ తేదీన తెలంగాణలోని హైదరాబాద్ టి హబ్‌లో జరిగిన జాతీయ స్థాయి రోబోటిక్, కృత్రిమ మేధస్సు వర్క్‌షాపులో ఈ అవార్డు సాధించిన స్కూల్ విద్యార్థులను, యాజమాన్యాన్ని ఎంఎల్ఎ ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం అభినందించారు. ఈ అవార్డు ఎపి, తెలంగాణలో మొట్టమొదటిసారిగా తమ పాఠశాలకు రావడం సంతోషకరమని పాఠశాల డైరెక్టర్లు తాడేపల్లి రాజా క్రాంతి కుమార్, బట్టు విజయ్ అన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించడానికి సహాయ సహకారాలు అందించిన వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. క్రిసాలిస్ ఇంటర్నేషనల్ స్కూల్ త్వరలో జరగబోయే అంతర్జాతీయ రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు వర్క్‌షాపునకు హాజరవుతుందని పాఠశాల డైరెక్టర్లు తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కెఆర్.పురం ఐటిడిఎ పిఒ రాములునాయక్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్

ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నివసిస్తున్న లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కెఆర్.పురం ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్ ఆదేశించారు. కెఆర్.పురంలో ఆర్అండ్ఆర్ కాలనీల ప్రగతిపై ఆయన శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ రాములునాయక్ మాట్లాడుతూ సమీక్ష సమావేశంలో ప్రాధాన్యత గ్రామాల వారీగా ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం, రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్ తదితర పనుల ప్రగతిని సమగ్రంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యతతో పాటు నిర్ణీత కాలపరిమితిలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అలాగే ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నివసిస్తున్న లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఎపిఇడబ్ల్యుఐడిసి, పంచాయతీ రాజ్ శాఖల కార్యనిర్వాహక సంస్థలు, ఆర్ అండ్ ఆర్ కాలనీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మెరిట్ లిస్ట్‌లో అభ్యంతరాలపై దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏడాది కాలానికి కాంట్రాక్ట్, పొరుగు సేవల విధానంలో స్టోర్ కీపర్, జనరల్ డ్యూటీ అటెండెంటు పోస్టుల భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం ఫైనల్ మెరిట్ లిస్ట్‌ను దరఖాస్తుదారుల పరిశీలనార్థం https://eluru.ap.gov.in, https://westgodavari.ap.gov.inలో పొందుపరిచినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.సావిత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లిస్ట్‌లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే, అభ్యర్థులు తగు ఆధార పత్రాలతో ఈ నెల ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి స్వయంగా వచ్చి అభ్యంతరాలపై దరఖాస్తు అందించాలని తెలిపారు. నిర్దేశించిన గడువు తరువాత వచ్చిన అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోబోమని తెలిపారు. ప్రక్రియ అంతా విధివిధానాలను అనుసరించి సరైన పద్ధతిలో పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి దళారులను మధ్యవర్తులను నమ్మవద్దని పేర్కొన్నారు.

మ్యాంగో బే రిక్రియేషన్ అండ్ కల్చరల్ సొసైటీ క్లబ్‌లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించొద్దు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎస్ఐ శుభశేఖర్

మ్యాంగో బే రిక్రియేషన్ అండ్ కల్చరల్ సొసైటీ క్లబ్ నిర్వాహకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో మండల పరిధిలోని పోతవరప్పాడు గ్రామ పరిధిలో ఉన్న మ్యాంగో బే రిక్రియేషన్ అండ్ కల్చరల్ సొసైటీ క్లబ్‌పై పోలీసులు దాడి చేసిన సంఘటనకు సంబంధించి క్లబ్ నిర్వాహకులు, నిందితులు కేసుకు సంబంధించి పోలీసులకు సహకరించాలని, 13 ముక్కల రమ్మీ గేమ్‌ను కాయిన్స్ పెట్టి ఆడకూడదని, క్లబ్‌లో సాంస్కృతిక కార్యకలాపాలైన కబడ్డీ, చెస్, షటిల్, స్విమ్మింగ్ వంటివి మాత్రమే నిర్వహించాలని, పేకాట వంటి జూద క్రీడల నిర్వహణ చేపట్టకుండా పోలీసులు ఏ సమయంలోనైనా క్లబ్‌ను పర్యవేక్షించవచ్చని చెప్పారు. గత నెలల్లో మ్యాంగో బే రిక్రియేషన్ అండ్ కల్చరల్ సోసైటీ క్లబ్‌పై ఉన్నతాధికారుల ఆదేశానుసారం నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో దాడి చేసి క్లబ్ నిర్వాహకులతో పాటు పేకాట ఆడుతున్న 285 మంది జూదరులను, రూ.32లక్షల నగదును, పలు వాహనాలను స్వాధీనం చేసుకుని నూజివీడు కోర్టుకు తరలించిన సంఘటన తెలిసిందే.

విద్యార్థులకు ఎస్ఐ అభినందన

ప్రజాశక్తి - ముసునూరు

ఓ దుకాణంలో కాలం చెల్లిన కూల్‌డ్రింక్‌లను విక్రయిస్తున్నట్లు గుర్తించి పోలీసులకు తెలిపిన విద్యార్థులను ఎస్ఐ చిరంజీవి అభినందించారు. మండల కేంద్రమైన ముసునూరు ఎంపిపి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు శనివారం స్థానిక బస్టాండ్ ప్రధాన కూడలి సెంటర్ వద్ద ఉన్న షాపులోకి వెళ్లి కూల్‌డ్రింక్ బాటిల్ తీసుకున్నారు. ఆ బాటిల్ కాలం చెల్లిందని గుర్తించి షాపు యజమానిని అడిగారు. దీంతో షాపు యజమాని కోపానికి గురవ్వడంతో విద్యార్థులు ఆ డ్రింకు బాటిల్ పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ ఎం.చిరంజీవికి విషయం చెప్పారు. వెంటనే ఆ షాపు యజమానిని పిలిపించి హెచ్చరించారు. ఎస్ఐ ముగ్గురు విద్యార్థులను అభినందించారు.


ఆర్థిక సాయం అందిస్తున్న జగదీశ్వరి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని దేవరగొంది గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమై సర్వం కోల్పోయిన అభిమళ్ల సత్యనారాయణ కుటుంబానికి శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి దంపతులు సాయం అందించారు. ఈ ప్రమాదంలో నిరాశ్రయులై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి ఆమె శనివారం విజయ్‌నాయక్‌తో కలిసి రూ.పది వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా కొవ్వాసు జగదీశ్వరి మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో తమ వంతు సాయంగా ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా బాధితులను ఆదుకుంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకొచ్చి ఇలాంటి బాధిత కుటుంబాలకు సహాయం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

భీమడోలు : పాస్ పుస్తకాలు అందిస్తున్న నేతలు

పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వివరాలు పారదర్శకంగా పొందుపరిచిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఎన్‌డిఎ ప్రభుత్వం చేపట్టిందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. మండలంలో ఎపి భూమి హక్కు, పట్టాదారు పాస్ బుక్ చట్టం-1971-కి అనుగుణంగా రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నూతన పట్టాదారుల పాస్ పుస్తకం పంపిణీ కార్యక్రమం భీమడోలు మండలంలో శనివారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా కోడూరుపాడు గ్రామంలో తహశీల్దార్ బి.రమాదేవి ఆధ్వర్యంలో ప్రారంభమైన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉంగుటూరు ఎంఎల్‌ఎతో పాటు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 414 నూతన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రముఖులు పుప్పాల ఎను, డి.పుల్లయ్యనాయుడు, భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గిరి, పత్తి మదన్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల తొమ్మిదో తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఎపి హక్కులు, భూములు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం-1971 ప్రకారం, రాజకీయ పార్టీ గుర్తులు, పేర్లు తొలగించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చిహ్నంతో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమం మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభల ద్వారా నిర్వహిస్తామని, ప్రజా ప్రతినిధుల సమక్షంలో పాస్ పుస్తకాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. పంపిణీ సమయంలో లబ్ధిదారుల బయోమెట్రిక్ ధ్రువీకరణ అనంతరం మాత్రమే కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు అందిస్తారని, ముద్రించిన పాస్‌బుక్స్‌ను వెబ్‌ల్యాండ్ వివరాలతో సరిపోల్చి ఎలాంటి తప్పుల్లేకుండా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ (ఇకెవైసి) అప్లికేషన్ ద్వారా నిర్వహిస్తామని తెలిపారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ప్రజాశక్తి - ముసునూరు

బాల్య వివాహాలు చేస్తే అనారోగ్యానికి గురవుతారని సిడిపిఒ విజయకుమారి చెప్పారు. మండల పరిధిలోని చింతలవల్లి శివారు గోగులంపాడు, వలసపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మితో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ అతి తక్కువ పిల్లలు ఉన్న అంగన్వాడీ కేంద్రాలు ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పారు. పిల్లల సంఖ్య పెంచుకోవాలన్నారు. గ్రామంలో బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.


మాట్లాడుతున్న కాలనీవాసులు

లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో లో ఓల్టేజ్ సమస్యను విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించారు. గత కొన్ని రోజులుగా లో ఓల్టేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామంలోని వినోద్ నగర్ కాలనీ వాసులు విద్యుత్ శాఖ సిబ్బందికి తెలిపారు. ఈ విషయాన్ని సిబ్బంది ఎఇ నాగ శేషుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఈ సమస్యను ఎడిఇ రమేష్ దృష్టికి తీసుకెళ్లి సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. వెంటనే సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడంతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. కాలనీలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడంతో విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

గూటాలలో 'మీ భూమి మీ హక్కు'

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో జరిగిన మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో ఏపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి శనివారం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సాయిరాజు, టిడిపి మండలాధ్యక్షులు మంగిన కొండ, నీటిపారుదల సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్, దోశల నాగేశ్వరరావు, జనసేన పార్టీ ఐటీ వింగ్ కోఆర్డినేటర్ ఆటపాకల వెంకటేశ్వరరావు, కోడి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు సునకాని రాంబాబు, పుడి వెంకట్రావు, టిడిపి మాజీ మండలాధ్యక్షులు పాపోలు గణపతి రత్నయ్య, ఏనుగుల శ్రీనివాస్, పివివి.సత్యనారాయణ, జల్లేపల్లి శివసూర్యనారాయణ, కరిబండి నాగరాజు, పతివాడ శ్రీనివాస్, రొంగల అప్పారావు, దవళ వీరన్న, వలవల శ్రీను, సాంబ, అన్నవరం, రెడ్డెన్న సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పూలే జీవితం నేటి తరాలకు మార్గదర్శకం

ఘనంగా సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలు


ఏలూరులో...

టి.నరసాపురంలో...

ప్రజాశక్తి - ఏలూరు

సావిత్రి బాయి పూలే 195వ జయంతి కార్యక్రమం ఏలూరులోని హోప్ స్కూల్లో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, మానవత, హేలాపురి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో 300 మందితో నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సావిత్రి బాయి చిత్రపటానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మానవత ఛైర్మన్ మానేపల్లి సత్యనారాయణలు పూలమాల వేయగా అతిథులుగా హాజరైన హేలాపురి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, మానవత అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మేతర అజయ్‌బాబు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు డివివి.నరసింహారావు, హోప్ స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ పద్మ, స్కూల్ టీచర్లందరూ సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో పలువురు మాట్లాడారు. హోప్ స్కూల్ టీచర్లకు 2026 డైరీలను, విద్యార్థులకు పెన్నులు మానేపల్లి సత్యనారాయణ అందించారు.

వట్లూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో 300 మందితో నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సావిత్రి బాయి చిత్రపటానికి రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ డి.ఝాన్సీరాణి నిరుసు నాగమణి పూలమాల వేయగా అతిథులుగా హాజరైన హేలాపురి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మానవత అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మేతర అజయ్‌బాబు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు డివివి.నరసింహారావు, పి.భాస్కరరావు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్స్, విద్యార్థులందరూ సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలు అర్పించి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రిన్సిపల్ డి.ఝాన్సీరాణి మాట్లాడారు. బోఫ్ జాతీయ అధ్యక్షులు, ఇరిగేషన్ డిఇఇ, హేలాపురి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడారు. హేలాపురి బాలోత్సవం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 1831 జనవరి మూడో తేదీన జన్మించిన సావిత్రిబాయి పూలే భర్త ప్రోత్సాహంతో చదువుకుని మొదటి మహిళా టీచర్ అయ్యారన్నారు. మేతర అజయ్‌బాబు, అతిథులుగా హాజరైన నెరుసు నాగమణి, డివివి నరసింహారావు, పి.భాస్కరరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జీవితంలో ఎన్నో ఆటంకాలు ఎదుర్కొన్నప్పటికీ అనేక రకాల సేవలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చేశారన్నారు. హేలాపురి బాలోత్సవం కమిటీ తరఫున డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటాన్ని ఫుట్బాల్ పుస్తకాన్ని ప్రిన్సిపల్ టీచర్లకు గుడిపాటి నరసింహారావు, దేవరకొండ వెంకటేశ్వర్లు అందించారు. మైక్రో ఆర్ట్స్, మెమరీ టెస్ట్, పేపర్ క్రాఫ్ట్‌లో బెస్ట్ ఫైవ్‌లలో బహుమతులు పొందిన వారికి మెమొంటోలు, సర్టిఫికెట్లు అందించారు.


చింతలపూడిలో...

ఏలూరు సిటీ : మహిళా విద్యకు బాటలు వేసి, సామాజిక సమానత్వం కోసం నిరంతరం పోరాడిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు మాతా సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన ఆమె విగ్రహానికి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళల విద్య, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ మహిళా విద్యాభివృద్ధికి జిల్లా పరిషత్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఏలూరు అర్బన్ : చదువుల తల్లి, సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే 195వ జయంతి శనివారం స్థానిక ఆర్ఆర్.పేటలోని బిసి హక్కుల సాధన పోరాట వేదిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బిసి జెఎసి నగర ఛైర్మన్ కెల్లా కన్నబాబు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. బిసి జెఎసి నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, సిఐటియు ఏలూరు మంచర్ల ఇస్సాకు, విశ్రాంత ఉద్యోగులు కంచర్ల దక్షిణామూర్తి, కోన ప్రసాద్, జరజాపు ఉమా, బిసి నాయకులు పిచ్చుక ఆదిశేష తదితరులు సావిత్రిబాయి పూలే కు జోహార్లు అర్పించారు.

చింతలపూడి : చింతలపూడి ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సామాజిక సంస్కర్త అని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సావిత్రి బాయి పూలే 195వ జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఇఒ ఎస్.కళ్యాణి మాట్లాడారు. 6,7 తరగతుల విద్యార్థునుల పాటలు, డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు జి.దీపా ఈశ్వరీ దేవి, రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు బాలాచలం, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సులోచన, అరుణ, మహాలక్ష్మి, పుష్పావతి, వరలక్ష్మి, ప్రశాంతి, నిర్మల, మధులత, నక్షత్ర, సుకన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు : మండల పరిధిలోని మద్దాయిగుంట మోడల్ ప్రైమరీ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు యువరాజు ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యువరాజు మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం, సమానత్వం కోసం, కుల, లింగ వివక్షతపై ధైర్యంగా పోరాడిన సావిత్రిబాయి పూలే జీవితం నేటి తరాలకు మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డానియల్, జ్యోతి, జయప్రద, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలోని పరింపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెండ్యాల రమాదేవి హాజరయ్యారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుల అరుణ, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ చింతల వెంకటరమణ, కొయ్యలగూడెం మండల ప్రధాన కార్యదర్శి చిటికెన బాలగంగాధర్ తిలక్, మండల వాణిజ్య విభాగం సెక్రటరీ గుడిమెట్ల శేషరావు, టిడిపి రాష్ట్ర బిసి సాధికారక సభ్యులు నిమ్ము జగదీశ్వరరావు, టిడిపి మండల ఉపాధ్యక్షులు ముదునూరి రామకృష్ణరాజు, మండల నాయకులు బొబ్బర చినరాజు, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి : విద్యతోనే మహిళాభివృద్ధి చెందుతుందని నమ్మి మహిళలకు చదువు నేర్పిన భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు మాత సావిత్రిబాయి పూలే అని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు మేడ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని అల్లినగరం ఎంపిపి స్కూలులో శనివారం నిర్వహించిన సావిత్రి పూలే జయంతి కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ రాంద్రు అమ్మాజీ జి.విజయలక్ష్మిలను శనివారం ఘనంగా సన్మానించారు. చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

అంబులెన్సులను పరిశీలించిన ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అంబులెన్సుల నిర్వహణపై ఇటీవల వచ్చిన కథనాల నేపథ్యంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్వయంగా ఆసుపత్రిని సందర్శించి అంబులెన్సులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబులెన్సులు సరిగా పనిచేయడం లేదన్న ప్రచారం పూర్తిగా వాస్తవ రహితమని స్పష్టం చేశారు. కావాలనే వినియోగంలో లేని పాత అంబులెన్సులను చూపించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.


అంబులెన్సును పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో అన్ని హంగులతో, ఆధునిక వైద్య సదుపాయాలతో అంబులెన్సులు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వేగంగా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వైద్య సేవల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రైతుల్లో యూరియా వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కెవిఎన్.పోసరావు మాట్లాడుతూ యూరియాను అధికంగా వినియోగించడం వల్ల పంటలు, నేల, నీటిపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడతాయని వివరించారు. మట్టిలోని సూక్ష్మజీవులు నశించడంతో నేల సారత తగ్గి, చౌడు సమస్య పెరుగుతుందని చెప్పారు. అనంతరం కొయ్యలగూడెం మెయిన్ సెంటర్ వరకు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి యూరియా వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ముసునూరులో...

ముసునూరు : యూరియా అధికంగా వాడటం వల్ల భూసారం తగ్గుతుందని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా చెప్పారు. మండల పరిధిలోని కాట్రేనిపాడు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులతో కలిసి యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా మాట్లాడుతూ యూరియా అధికంగా వాడటం వల్ల భూమిలోని భూసారం తగ్గి, పంట దిగుబడి తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు, టిడిపి నాయకులు రాపర్ల బాలకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది, పకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో...

పోలవరం : యూరియా అధికంగా వాడితే పంటల్లో పచ్చదనం పెరిగినా నాణ్యమైన దిగుబడి రాదని కెఆర్.పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పిజి.బుజ్జిబాబు అన్నారు. మండలంలోని కృష్ణారావుపేట సొసైటీలో పోలవరం గ్రామ రైతులకు యూరియా అధిక వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యూరియా అధికంగా వాడితే మొక్కలు బలహీనమై తెగుళ్లు, పురుగుల బెడద పెరుగుతుందని తెలిపారు. నేలలోని సూక్ష్మజీవులు నశించి చౌడు పెరుగుతుందని, భూగర్భ జల కాలుష్యం వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించవచ్చన్నారు. మండలంలోని ఐదు సొసైటీల్లో 250 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన మేరకే వినియోగించాలని రైతులను కోరారు. సొసైటీ ప్రెసిడెంట్ కొణతల ప్రసాద్ మాట్లాడుతూ అధిక ఎరువుల వినియోగంతోనే నేలలు గుల్లగా మారుతున్నాయని, అధికారులు సూచించిన మేరకు ఎరువులు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు చంటి, విష్ణుమూర్తి,పాల్గొన్నారు.

CHANGE OF NAME

I **NIHAL KUMAR VIMAL KUMAR JAIN** S/o Vimal Kumar Misrimal Jain D.No. 6-14-2, Kavali Adinarayana Street, Narasapuram-534275, W.G.Dt, A.P. I have changed my Name from **NIHAL KUMAR VIMAL JAIN** (Old Name) to **NIHAL KUMAR VIMAL KUMAR JAIN** (New Name). Henceforth I am being called **NIHAL KUMAR VIMAL KUMAR JAIN** S/o Vimal Kumar Misrimal Jain, for all purposes.

దస్తావేజులు పోయినవి

పూసరపు వెంకటేశ్వరరావు తండ్రి వీర్రాజు డోర్‌నెం.2-11-6/4, శాంతినగర్ ఆపోజిట్ సిద్దార్ధ పిల్లల హాస్పటల్,పాటిమీద, నిడదవోలు పట్టణ వాస్తవ్యులు తూర్పుగోదావరి జిల్లా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా స్థలమునకు సంబంధిచిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.2424/1991లు గల ది.15-08-2025 తేదీన ఉదయం 11.00గం॥లకు భీమడోలు సెంటర్ నందు టి త్రాగుటకు కారు ఆపినాము. ఆసమయములో అచ్చట ఒరిజినల్ లింకు డాక్యుమెంటు వున్న కవరు పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కావునా ఎవరికైన దొరికిన యెడల ఈ దిగువ అడ్రస్‌నకు తెలియజేయవలసినదిగా కోరుచున్నామయు.

పూసరపు వెంకటేశ్వరరావు
తండ్రి వీర్రాజు డోర్‌నెం.2-11-6/4,
శాంతినగర్ ఆపోజిట్ సిద్దార్ధ పిల్లల హాస్పటల్,
పాటిమీద, నిడదవోలు.
సెల్.9397112345,9849714575

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, పైడిపాక గ్రామానికి చెందిన గంగుల ప్రభావతి W/o.శ్రీనివాసరావులకు చెందిన దస్తావేజు నెంబర్ 1672/2016 సర్వే నెంబరు 390/1ఎలో 0.56సెంట్లు గల దస్తావేజు ఏలూరు జిల్లా కామవరపుకోట నుండి జంగారెడ్డిగూడెం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోయినవి దొరికిన వారు కింది అడ్రస్‌కు అందించగలరు.

ఫోన్ నెంబర్ 9912129240

5 నుంచి ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలో ఈ నెల ఐదో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు ఐదు నుంచి 17 సంవత్సరాల మధ్య విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పద్మావతిదేవి తెలిపారు. దీనిలో భాగంగా దుద్దేపూడి సచివాలయం ఆధ్వర్యంలో గుండుగొలను శ్రీ విద్యాలయ కాన్వెంట్ ఆవరణలో పొలసానిపల్లి సచివాలయం ఆధ్వర్యంలో భీమడోలు శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఆవరణ వేదికగా క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటి నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

మూడో విడత స్వమిత్వ సర్వేపై శిక్షణా కార్యక్రమం

మండలంలో చేపట్టిన స్వమిత్వ కార్యక్రమం మార్చి 20వ తేదీ నాటికి పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీ సచివాలయ సిబ్బందితోపాటు, ఇంజినీరింగ్ సహాయకులు, సర్వేయర్లను ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. మండల కేంద్రంలో డిప్యూటీ ఎంపిడిఒ సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే చేయాల్సిన తీరుతెన్నులు, పారదర్శకంగా సమాచారం సేకరించాల్సిన విధానం, వివరాల నమోదు ఇతర అంశాల గురించి వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఒ మాట్లాడుతూ మండల పరిధిలో స్వర్ణ సంక్రాంతి పురస్కరించుకుని చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల ఐదో తేదీన గ్రామసభ నిర్వహించే సమయానికి గతనెల 26వ తేదీన ప్రారంభించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ఆదివారంతో పూర్తి చేయాలని కోరారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ రాజారెడ్డి సూచించారు. కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజారెడ్డిని ఆటో యూనియన్ నాయకులు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో కలుసుకుని ఆటో డ్రైవర్ల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్, వాహన బీమా, పర్మిట్ వంటి పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వేగ నియంత్రణ పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, హెల్మెట్, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని, చట్టాలను గౌరవిస్తూ వృత్తి నిర్వహించాలని సూచించారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రత కోసమే పని చేస్తుందని, డ్రైవర్లు పోలీస్ శాఖతో సహకరించాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆటో డ్రైవర్లకు పికపింగ్, డ్రాపింగ్ స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రవాణా కార్మికుల మధ్య సమన్వయం ఎల్లప్పుడూ ఉండాలని, రోజు వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ అధ్యక్షులు పోచారపు వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఘంటసాల రమేష్, ఉపాధ్యక్షులు దార కృష్ణ, ఆటో డ్రైవర్లు శనగ రాము, వేల్పుల దుర్గయ్య, మంగరాజు, వినోద్, ఆదినారాయణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

'మన చేనేత - మీ చేయూత' ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మన చేనేత - మీ చేయూత కార్యక్రమాన్ని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ శకనకరాజు సూరి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ ఘంటశాల వెంకటలక్ష్మి, ఎపిఐఐసి డైరెక్టర్ చెనమళ్ల చంద్రశేఖర్, భీమవరం జనసేన నాయకులు బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలాల నుంచి దేశీయ చేనేత హస్తకళల ప్రదర్శన, వస్తువులు, దుస్తుల అమ్మకాల స్టాల్స్‌ను, ప్రక తి వ్యవసాయ ఉత్పదనల స్టాల్స్‌ను పలువురు నేతలతో కలిసి ఎంఎల్‌ఎ స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాణ్యమైన చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉంచి, చేనేత కార్మికులకు నేరుగా మార్కెట్ కల్పించేలా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన క్షత్రియ కార్పొరేషన్ వారిని అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ చేనేత అనేది మన దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అన్నారు. దేశీయ చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా లక్షలాది చేనేత కార్మిక కుటుంబాలకు జీవనాధారం లభిస్తుందన్నారు. మన చేనేత - మీ చేయూత వంటి కార్యక్రమాలు చేనేత రంగ పునరుజ్జీవనానికి కీలకంగా నిలుస్తాయని చెప్పారు. చేనేత ఉత్పత్తులకు విస్తృతమైన మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ నూజివీడు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.10/2024
O.S.234/2016
Between:
సమ్మెట ఝాన్సీరాణి మరియిద్దరు ....DHrs
Vs
కలపాల వరమ్మ మరి యొకరు ..... J. Drs

ఈ J.Dr లచే తనఖా ఏర్పరిచిన దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థి ది.10-02-2026 వ తేదీన ఉదయం గం. 10.30 ని॥ల లగాయితు పైకోర్టు వారిచే పైకోర్టులో వేలం వేయబడును. కావలసిన వారు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు : పూర్వం కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ ఇలాకా, ఆగిరిపల్లి మండలం, పోతవరప్పాడు గ్రామంలోని లోని BR.S.No.198/2A లోని ఎ 0.79 సెం మరియు BR.S.No. 198/2E లోని ఎ 0.89 సెం. వెరశి ఎ 1.68 సెం భూమికి హద్దులు:
తూర్పు: మండా అబ్రహాం గారి భూమి
దక్షిణం: లింగంపల్లి ప్రకాష్ గారి భూమి
పడమర: కంభంపాటి ధర్మారావు గారి భూమి
ఉత్తరం: పోతవరప్పాడు పొలిమేర
ఈ హద్దుల మధ్యన గల ఎ 1-68 సెం భూమికి
D.Hr విలువ రూ.20,00,000/-
అమీనా విలువ రూ.30,00,000/-
వేలం తేదీ : 10-02-2026
Further hearing Date :17.02.2026
నూజివీడు
ది.05-01-2026
ఎన్.వి.భవాని కుమార్,
న్యాయవాది, నూజివీడు.